# ఇన్లాండ్ లెటర్ కథలు



## సగటు మనిషి

మార్కెట్లోకి అడుగుపెట్టాను.

కూరల ధరలు అంతరిక్షయానం చేస్తున్నాయి.

"టమేట ఎంత?"

"మూడు రూపాయలు..పావు"

"అబ్బో మూడే... బెండకాయ ఎంత?"

"మూడున్నర"

"ఆనపకాయ?"

"ఆ చిన్నది ఐదు రూపాయలు"

ఇహ వినే ఓపిక లేదు... ఇప్పటికే నా మధ్యతరగతి అంతరాత్మ ఘోషిస్తోంది. ముందుకు కదిలాను..

"రూపాయి పాలకూర ఇవ్వు"

మూడు కట్టలు ఇచ్చాడు.. ఇంటి దారి పట్టాను.

నెలకోసారి వచ్చే చాలీచాలని జీతంతోనెలంతా నెట్టుకురావాలి.. పొదుపు.. కాదు.. కాదు పీనాసితనంగా వుంటే గాని బ్రతుకు బండి లాగటం కష్టం.. ఏ క్షణం ఏం అవసరం వస్తుందోనని బిక్కు బిక్కుమంటూ గడపాలి.

ఆఫీసు ఇంటికి మూడు కిలోమీటర్ల దూరం.. నడిచి వెడితే డబ్బులు ఆదా అవుతాయని నడిచి వెళ్ళి వస్తుంటాను. నడక ఆరోగ్యానికి మంచిదన్న సూత్రాన్ని బలవంతంగా 'నాకు అన్వయించుకుని.. మార్గమధ్యంలో మార్కెట్ వుంది.. అక్కడ కొంటే చవగ్గా వస్తాయన్న ఆశ.. కానీ అక్కడా అంతే గుండెలు గుబగుబలాడే ధరలు.. దాదాపరు ఇరవై రోజులు ఆకుకూరలతోటే సరిపెట్టుకుంటాం.

ఇంటికొచ్చాను.

నన్ను చూడగానే 'నాన్నారూ.." అంటూ నా కాళ్ళకు చుట్టుకుపోయే నానిగాడు ఎందుకో రాలేదు.. నా మనసేదో కీడు శంకించింది. అనుకున్నంతా అయింది. నా భార్య ఏడుస్తూ వచ్చి నన్ను చుట్టేసుకుంది.

"ఏవైంది.. భానూ.." తల నిమురుతూ అన్నాను.

"నానికి మధ్యాహ్నం నుండి విరోచనాలు అవుతున్నాయండీ.. చుట్టుప్రక్కల డాక్టర్ లేదు.. నాకేం చేయాలో పాలుబోవడం లేదు. బాబు కళ్ళు తేలేస్తున్నాడు.." వెక్కుతూ అంది.

నేను గబగబ మంచం దగ్గరకెళ్ళి చూశాను.

కాళ్ళూ చేతులూ వేళ్ళాడేసి పడుకున్నాడు నాని.. మగతగా వున్నాడు.. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.. నాతో బోల్డన్ని కబుర్లు చెప్పే నాని.. అలా అచేతనావస్థలో వుండడం చూసేసరికి..

"భయపడకు భానూ.. నేను ఆటో తీసుకువస్తాను."

మాది కొత్తగా డెవలప్ అవుతున్న కాలనీ.. అక్కడక్కడా చెదురుమదురుగా వుంటాయి ఇళ్ళు.. తక్కువ అద్దె అని ఇక్కడికి వచ్చి పొరపాటు చేశాను.. అర కిలోమీటరు పరుగులాంటి నడకతో వెళ్ళి అక్కడున్న ఆటోని ఐదు రూపాయలు మీటరు మీద ఎక్కువిస్తానని చెప్పి బ్రతిమాలి పట్టుకొచ్చాను.

నానిగాడిని హాస్పిటల్‌కి తీసుకెళ్ళాం.

"బాబుని సమయానికి తెచ్చారు.. లేకపోతే.." అన్న డాక్టర్ మాట విని మా పై ప్రాణాలు పైనే పోయాయి. భాను అయితే సరేసరి.. ఆమెని అనునయించలేకపోయాను.

ట్రీట్‌మెంట్ ప్రారంభమైంది.

మరుసటి రోజు మధ్యాహ్నం బాబుని డిస్చార్జ్ చేశారు.

ఆటోలో ఇంటికెడుతూ.. చేతిలో వున్న హాస్పిటల్ బిల్స్, డాక్టర్ ఫీజు. మందుల బిల్స్.. వంక విరక్తిగా చూశాను.. మొత్తం ఖర్చు ఎనిమిది వందలు.

సగటు మనిషి దొరికిపోయేదిక్కడే.. కోరికలని చంపుకుని.. బేరాలాడి పైసా పైసా కూడ బెడతాడు.. కాని తన వాళ్ళేమయిపోతారోనని డబ్బు మంచినీళ్ళలా ఖర్చు పెట్టేదిక్కడే.. ఇంకేం చేయగలడు?

నానిగాడి బుగ్గల మీద ముద్దులు ముద్రిస్తోంది భాను.. నాకూ ఆనందంగానే వుంది.. నాకింకేం కావాలి? నాని నవ్వుతున్నాడు.. అద్చాలు.

–పి.వి. సుబ్బారాయుడు



## అలక

'చిత్రాలయకు పోనీ", వీణ మీటినట్లుంది ఆమె స్వరం.

ఆటోవాడు క్షణంసేపు కన్నార్పకుండా చూశాడు. అది అతని తప్పు కాదు, ఆమె అందానిది.

థియేటర్‌లో పెద్దగా జనం లేరు. ఓ మూలగా వెళ్ళి కూర్చుంది. సినిమా ప్రారంభమైన పది నిమిషాలకి లోనికి ప్రవేశించాడతను; వయసు ఇరవై ఎనిమిది వుండొచ్చు, చాలా హుందాగా వున్నాడు. నెమ్మదిగా వచ్చి ఆమె ప్రక్కన కూర్చున్నాడు అతనివైపు ఓసారి చూసి తల తిప్పకుంది.

"మీరు ఈ రోజు చాలా అందంగా వున్నారు" పలకరించాడతను, ఆమె కోపంగా చూసింది.

పాత డైలాగే అయినా నిజం చెప్పాలి కనుక చెబుతున్నాను. "మీరు కోపంలో కూడా చాలా...!!" ఆమె కోపంగా చూడటంతో మధ్యలోనే ఆపేశాడు.

"మీ బుంగమూతి చూస్తుంటే ముద్దుపెట్టుకోవాలనిపిస్తుంది" కొంచెం సేపాగి అన్నాడు; రంభను చూడాలో మిమ్మల్ని చూడాలో అర్థం కావడం లేదు!!

తెరమీద రంభ చిరంజీవిని ఆటపట్టిస్తుంది.

"ఆమె చిన్నగా నవ్వింది"

అతను ఫ్రీ అయ్యాడు; నెమ్మదిగా ఆమె చేతిమీద చెయ్యివేసి తన చేతుల్లోకి తీసుకున్నాడు.

ఆమె మాట్లాడలేదు.

చప్పున వంగి ఆమె బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె లోగొంతుతో అంది "ఏమిటి మీరు ఎవరైనా చూస్తే!? చూసే అంత దగ్గరలో ఎవరూ లేరు అంటూ ఆమె నడుంమీద చెయ్యేసి నొక్కాడు; ఎక్కడెక్కడో తడుముతున్నాడు. ఆమె ఏమీ అనకపోవడంతో మరింత రెచ్చిపోయాడు. కొంచెంసేపాగి చిరిగ్గా అందామె "ప్లీజ్ నన్ను సినిమా చూడనియ్యరా?" చూడనియ్యను అంటూ ఈసారి ఆమె బుగ్గను సున్నితంగా కొరికాడు; ఆమె చప్పన కుర్చీలోనుండి లేచింది, అతను లేవనియ్యలేదు.

ఇలా అయితే నేను వెళ్ళిపోతాను కోపంగా అంది. శ్రీమతి గారికి ఇంకా కోపం పోలేదా! ప్లీజ్. నేను చెప్పేది విను, నిన్ను సినిమాకి తీసుకెళతానన్నమాట నిజమే కానీ ఆఫీసు పనివల్ల లేటయ్యింది; "సారి" అతను చిన్నపిల్లాడిలా నిజాయితీగా చెప్పాడు. ఈసారి అతని చేతిని ఆమె చేతుల్లోకి తీసుకుంది. భర్త చిన్నపిల్లాడిలా సారీ చెబుతుంటే ఆమె మనసు కరిగిపోయింది.

–గూడపాటి ఆనంద్